ప్రజాశక్తి

గురువారం 18 ఏప్రిల్ 2024

I


అల్లూరి సీతారామరాజు



సివిల్స్‌లో గిరి పుత్రుడు ప్రతిభ

-545 ర్యాంక్ సాధించిన నరేంద్ర పడాల్

-ఆదివాసీ గిరిజన సంఘం అభినందనలు




ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం మారుమూల అండిభ గ్రామానికి చెందిన ఆదివాసి బిడ్డ చిట్టపులి నరేంద్ర పడాల్ 2023 సివిల్స్ పరీక్షలో ప్రతిభ చాటాడని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ధర్మన్నపడాల్, పి.బాలదేవ్ తెలిపారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సివిల్ సర్వీస్‌లో 545 ర్యాంకు సాధించిన చిట్టపులినరేంద్ర పడాల్‌కు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో సివిల్ సర్వీస్ క్యాడర్లో ఆదివాసులకు అణగారిన వర్గాలకు తన సేవలు అందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఈనెల 18న గురువారం నుంచి మొదలవుతోంది. జిల్లాలో అరకు, పాడేరు, రంపచోడవరం అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు అరకు, పాడేరు పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సిద్ధం చేశారు. ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత నుండి 24వ తేదీ వరకు సెలవు రోజులు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించ నున్నారు. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన, 29న మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి గడువు ఇచ్చారు. అదేవిధంగా శాసన సభకు పోటీ చేసే అభ్యర్థులు రూ.10 వేల డిపాజిట్ చెల్లించవలసి ఉంది. ఎస్సి, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మినహాయింపుతో చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా శాసనసభకు నామినేషన్ వేసే అభ్యర్థులు నామినేషన్ సమర్పించే సమయంలో పాటించవలసిన సూచనలను తదితర విషయాలపై అధికారులు వివరించారు.

ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల స్వీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, రోజువారి నివేదికలు పంపిణీ, ఏపిక్ కార్డులు జనరేషన్, సీజర్ మ్యానేజ్ మెంట్ రిపోర్టు తదితర అంశాలపై అల్లూరి జిల్లా కలెక్టర్, జిల్లాలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. నిఘా బృందాలను పటిష్టం చేయాలని, అవసరమైతే అదనపు బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జిల్లాలో అరకు పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వ్యవహరిస్తున్నారు. అరుకు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న అభ్యర్థుల నుంచి వీరి నామినేషన్లను పార్వతీపురం కలెక్టరేట్లో స్వీకరిస్తారు. పాడేరు అసెంబ్లీ సెగ్మెంట్‌కు అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. పాడేరు అసెంబ్లీ స్థానం పోటీ చేసే అభ్యర్థులు నుంచి అల్లూరి జిల్లా కలెక్టరేట్లో నామినేషన్లు స్వీకరించనున్నారు. పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట అధికారి విభిషేక్ అరుకు అసెంబ్లీ సెగ్మెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. అరకు అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీ చేసే అభ్యర్థుల నుంచి పాడేరు ఐటిడిఏలో నామినేషన్లను స్వీకరిస్తారు.





జనంలేక నిర్మానుషంగా ఉన్న ఏపీ జెన్కో కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి

మండుతున్న ఎండలు

- సీలేరులో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

- విలవిలలాడుతున్న జనం

ప్రజాశక్తి -సీలేరు

ఏప్రిల్ నెలలోనే భానుడు భగభగ మండుతున్నాడు. ఉదయం 7 గంటల నుంచి సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండడంతో ఎండవేడికి ప్రజలు విలవిలలాడుతున్నారు. సీలేరులో బుధవారం ఉదయం నుంచి ఎండ అధికంగా ఉంది. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి 40 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కాగా, అది క్రమేపీ పెరుగుతూ మధ్యాహ్నం 2.22 గంటలకు 41 డిగ్రీకి చేరుకుంది. మంగళవారం 38, 39 డిగ్రీలు నమోదైన ఉష్ణోగ్రత బుధవారం నాటికి పెరిగింది. అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలులను తట్టుకోలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత తాళలేక వ్యాపారులు దుకాణాలు మూసివేసి ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రజలు రోడ్ల మీద సంచరించేందుకు సాహసించడం లేదు. ఇల్లుకే పరిమితమై ఏసీలు కూలర్లు వేసుకొని సేద తీరుతున్నారు. సీలేరు నది పరివాహక ప్రాంతంలో ఉన్న గిరిజనులు పచ్చని చెట్లు నీడన ఉంటూ వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఎండ తీవ్రత వల్ల ఉపాధి హామీ పనులకు కూడా వెళ్ళటానికి సాహసించడం లేదు. సాయంత్రం ఐదు గంటలైనా వేడి తగ్గడం లేదు. సాయంత్రం 6 దాటిన తరువాత క్రమేపి వాతావరణం చల్లబడుతుంది. ఇదే రీతిగా ఎండవేడి, వేడుగాలులు ఉంటే వృద్ధులు, చిన్నారులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పసుపు సాగుపై గిరిజనుల ఆసక్తి



పొయ్యిలో ఉడక బెడుతున్న పసుపు

- కిలో పసుపు రూ.150లకు కొనుగోలు - గత ఏడాది కన్నా ధర పెరగడంతో హర్షం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని గిరిజనులు కాఫీ, మిరియాలతో పాటు కూరగాయాలు, పసుపు పంటలపై దృష్టి సారిస్తున్నారు.ప్రత్యేకంగా పసుపు పంటపై గిరిజనులు ఆశక్తి చూపి సాగు చేస్తూ ఆర్థికంగా పురోగతిని సాధిస్తున్నారు.ఈ పంటకు ప్రస్తుతం వారపు సంతల్లో బాగా గిరాకీ ఉంది. గత ఏడాది కన్నా ఈ ఏడాది ధర పెరగడంతో పసుపు పంట సాగు చేసే గిరి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది రూ 70లు, రూ.80 ధర ఉండగా ఈ ఏడాది రూ.150 లు ధర పెరిగింది.

మండలంలో బుధవారం జరిగిన కించుమండ వారపు సంతలో రూ.150తో వ్యాపారులు కొనుగోలు చేశారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రూ.80 ధర అదనంగా పెరిగింది. ఇదిలా ఉండగా సాగు చేసిన పసుపు పంటను తవ్వి తీసిన తర్వాత ఉడకబెట్టి ఆరబెడతారు. ఆ తరువాత వారపు సంతలకు తరలించి విక్రయిస్తారు. ఈ ఏడాది తగిన ప్రతిఫలం వచ్చిందని గిరి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాఫీ, మిరియాల పంటలకు ప్రభుత్వం ఏ విధంగా ప్రోత్సహిస్తుందో పసుపు పంట సాగు చేసే రైతులకు ప్రత్యేక ప్రోత్సాహం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని గిరి రైతులు కోరుతున్నారు. అలాగే రాయితీలు ఇచ్చి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని కోరారు.



ఎండబెట్టిన పసుపు కొమ్ములు

వికలాంగ పింఛను ఇప్పించరూ...

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని పాలగూడెం గ్రామానికి చెందిన సరియం చెంచయ్య వికలాంగ పింఛను ఇప్పించాలని కోరుతున్నారు. చెంచయ్యకు మూడేళ్లుగా కాళ్ళు, చేతులు పని చేయడం లేదు. తనను పంచాయితీ అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వికలాంగ పింఛను కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు వికలాంగ పింఛను ఇప్పించాలని కోరుతున్నారు.



కాళ్లు, చేతులు పనిచేయక మంచంపై ఉన్న చెంచయ్య



విద్యార్థినిని సన్మానిస్తున్న డిఇఒ, ఎఎంఒ

కెజిబివి విద్యార్థినికి డిఇఒ సన్మానం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన కెజిబివి విద్యార్థిని హరిప్రియను డిఇఒ వి.బ్రహ్మాజీరావు బుధవారం సన్మానించారు. విద్యార్థిని పాడేరు కస్తూర్బా గాంధీ విద్యాలయ పాఠశాలలో ఎంపిహెచ్‌డబ్ల్యూ రెండవ సంవత్సరం చదువుతోంది. ఇటీవల విడుదలైన ఇంటర్ రెండవ సంవత్సరం ఫలితాల్లో 1000 మార్కులకు గాను హరిప్రియ 915 మార్కులు సాధించింది. జిల్లాలో 22 మండలాల కెజిబివిల్లో పాడేరు కెజిబివి విద్యార్థిని మొదటి ర్యాంకు సాధించడంపై డిఇఒ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒ కె.భాస్కరరావు, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ కళ, ఉపాధ్యాయురాలు కె.శిరీష, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు : ఓటు హక్కును అందరు సద్వినియోగం చేసుకోవాలని జి.మాడుగుల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్, స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ రవీంద్రలు కోరారు. మండలంలోని పనసపుట్టు పంచాయితీలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా సిఐ రమేష్ మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఓటర్లకు సౌకర్యంపై తెలిపారు. ఎన్నికల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని, మద్యం పంపిణీ, తరలింపు చేయరాదని కోరారు. చట్ట విరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నాటు సారా తయారీ, విక్రయాలు చేయరాదన్నారు. గంజాయి తరలింపు, వ్యాపారులకు సహాయం వంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. మండలంలో యువత అత్యధికంగా గంజాయి పైలెటింగ్‌కు పాల్పడుతున్నారని, దీంతో భవిష్యత్తు కోల్పోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పనసపుట్ వైసిపి నేత తిరుపతి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల కృషితోనే ఉపాధి హామీ, అటవీ హక్కుల చట్టాలు రాక

వాటిని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం

సిపిఎం అభ్యర్థుల గెలుపుతోనే వాటికి రక్షణ

ఆ పార్టీ రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు

ప్రజాశక్తి -ఎటపాక

యుపిఎ-1 ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన కమ్యూనిస్టులు కృషి వల్లే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం వచ్చాయని సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు అన్నారు. మండలంలోని గుండాల కాలనీలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో రామారావు బుధవారం సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్ పెంచాలని, పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

అటవీ హక్కుల చట్టం వల్ల ఏజెన్సీలో గిరిజనులకు పోడు భూములకు హక్కు పత్రాలు వచ్చాయని చెప్పారు. ఉపాధి హామీ చట్టం కింద పేదలకు పనులు కల్పించడంతో వారికి ఆదాయం లభిస్తుందన్నారు. ఈ నిధులతో పంచాయతీల్లో కూడా అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవడానికి వీలుకలుగుతుందని తెలిపారు. నేడు వ్యవసాయంలో నష్టాలు వచ్చిన నేపథ్యంలో కూలీలను ఉపాధి హామీ చట్టం ఆదుకుంటుందని పేర్కొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం అభ్యర్థి లోతా రామారావు

కమ్యూనిస్టుల కృషితో వచ్చిన ఇటువంటి కీలకమైన చట్టాలను నిర్వీర్యం చేయడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని, దానికి నిధులు కోత పెడుతుందని విమర్శించారు. అటవీ హక్కుల చట్టానికి సవరణలు చేస్తూ అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. మరోమారు కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే ఈ చట్టాలను పూర్తిగా రద్దు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాలకు బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నా రాష్ట్రంలోని వైసిపి, టిడిపిలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ చట్టాలను కాపాడుకోవాలంటే రానున్న ఎన్నికల్లో సుత్తి కొడవలి, నక్షత్రం గుర్తులకు ఓట్లు వేసి సిపిఎం అభ్యర్థులను అసెంబ్లీ, పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు ప్రసన్న కుమార్, నాయకులు ఆకిశెట్టి రాము, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను ఓడించండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సురేంద్ర



ప్రచారంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-దుంబ్రిగుడ

ఆదివాసి చట్టాలను నిర్వీర్యం చేస్తున్న టిడిపి జనసేన బిజెపి కూటమి అభ్యర్థులను ఓడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే సురేంద్ర పిలుపునిచ్చారు. మండలంలోని గసభ పంచాయితీ మొర్రిగుడ గ్రామంలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం సురేంద్ర మాట్లాడుతూ, మతతత్వ బిజెపితో జతకట్టిన టిడిపి, జనసేనతో పాటు వారికి అంటకాగుతున్న వైసిపికి కూడా ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అటవీ హక్కు చట్టాన్ని అమలు పరచకుండా పర్యావరణ చట్టాలను సవరించి ఆదివాసులను గిరిజన ప్రాంతం నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రత్యేక హెూదా, రాష్ట్ర విభజన సమస్యలు, స్టీల్ ప్లాంట్ ,రైల్వే జోన్ వంటి సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఆదివాసి హక్కులు చట్టాలపై నిరంతరం పోరాటం చేస్తున్న అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పి అప్పలనర్సను, ఇండియా కూటమి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజు, మండల నాయకుడు మాజీ సర్పంచ్ సురేష్ కుమార్, వార్డు సభ్యుడు పి.సత్యనారాయణ, గసభ పంచాయతీ గిరిజనులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని ప్రచారం

సీలేరు : అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ సిపిఎం గాలికొండ పంచాయతీ ఎంపీటీసీ సభ్యులు అంపరంగి బుజ్జిబాబు గిరిజనులకు విజ్ఞప్తి చేశారు. జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ పనసల బంధం గ్రామంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. గిరిజనులతో సమావేశమై సిపిఎం అభ్యర్థి గెలుపు ఆవశ్యకతను వివరించారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న, విద్యార్థి దశ నుంచే అనేక పోరాటాలు చేసిన అప్పలనర్స వంటి వారు పార్లమెంట్‌కు వెళ్తే గిరిజనుల గొంతు అవుతారని పేర్కొన్నారు. జిఒ 3 రద్దుతో ఏజెన్సీలో నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని, దానిని పునరుద్ధరించాలని సిపిఎం మాత్రమే దీనిపై గట్టిగా పోరాడుతుందని చెప్పారు. గిరిజనులను అడవి నుంచి దూరం చేయడానికి గిరిజన చట్టాలు మారుస్తున్న బిజెపి, దాంతో పొత్తు పెట్టుకున్న టిడిపి జనసేన, తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపిని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కె.అర్జున్, వంతల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపిటిసి, సర్పంచ్

ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టరు వల్లే

ఆకులూరు ఘాట్ రోడ్డులో ప్రమాదాలు

ప్రజాశక్తి -సీలేరు

ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టరు ధన దాహంతో నాణ్యత లేకుండా చేపట్టిన నిర్మాణాల వల్లే జికె.వీధి మండలం ఆకులూరు ఘాట్ రోడ్లో ప్రమాదాలు జరుగుతున్నాయని గాలికొండ ఎంపీటీసీ సభ్యులు అంపరంగి బుజ్జిబాబు, సర్పంచి బుజ్జిబాబు అన్నారు. జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ పరిధి ఆకులూరు గ్రామ సమీపంలోని ఘాట్‌రోడ్డులో ఈనెల 13న సిమెంట్ లోడుతో వెళ్తున్న బోల్తాపడి, గాయాల పాలైన వంతల సన్యాసిరావు మరణించిన నేపథ్యంలో, సంఘటన ప్రాంతాన్ని బుధవారం ఎంపిటిసి, సర్పంచ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇదే ప్రదేశంలో ఆటో, టిప్పర్ బోల్తా కొట్టాయని తెలిపారు. తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నట్టు ఇంజనీరింగ్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు తెలియజేసినా కనీసం హెచ్చరిక బోర్డులు కూడా పెట్టలేదని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు రహదారిలో సైడ్ వాల్స్, కల్వర్టులు నాణ్యత లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ ఉండడం లేదని, దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వెల్లడించారు. ఇప్పటికైనా ఐటీడీఏ పీవో అభిషేక్, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని ఇక్కడ ప్రమాదాలు జరగకుండా తక్షణమే నివారణ చర్యలు చేపట్టే విధంగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్జున్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ అగ్నిగుండం ఉత్సవం

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం సీలేరులోని మారెమ్మ అమ్మవారి 52వ మహోత్సవాలు సందర్భంగా అగ్నిగుండం కార్యక్రమం మంగళవారం రాత్రి అమ్మవారి ధ్వజస్తంభం ముందు కన్నులు పండగ జరిగింది. ముందుగా సీలేరు నది సమీపంలో తమిళ పూజారి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సుందరంగా గరగ అలంకరణ చేశారు. మారెమ్మ అమ్మవారి మాలలు ధరించిన భక్తులు నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు చేపట్టి అగ్నిగుండం తొక్కారు. సుమారు 50 మందికి పైగా మారమ్మ అమ్మవారి భక్తులు అగ్నిగుండం తొక్కుతూ అమ్మవారి సన్నిధికి చేరి వారి భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుండి గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం గోవింద దంపతుల ఆర్థిక సహాయంతో ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. వివిధ ఆకృతులతో కూడిన సుందర దృశ్యాలను మందు గుండుతో ఏర్పాటు చేసి బాణసంచా కాల్చారు. వైసీపీ పాడేరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరాజు అగ్నిగుండం, మందు గుండు సామాగ్రికి ఆర్థిక సహాయం చేశారు. భక్తులు, ప్రజలు రద్దీని నియంత్రించడానికి జికె.వీధి సిఐ అప్పలనాయుడు, స్థానిక ఎస్సై రామకృష్ణ, సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ ఆధ్వర్యంలో పోలీసు బలగాలతో కట్టు దిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. ఏపీ జెన్కో సెక్యూరిటీ సిబ్బంది ఆలయం వద్దకు వాహనాలు వెళ్లకుండా ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడకుండా స్థానిక రెగ్యులేటరీ డ్యాం ముందే వాహనాలు నిలిపివేశారు. దీంతో అగ్నిగుండం కార్యక్రమం విజయవంతమైంది.

వాయిద్య కళాకారులకు సన్మానం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక మెరక వీధి రామాలయం వద్ద శ్రీనివాస భక్త సమాజ బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సప్తాహం (భజన) బుధవారం ఉదయం 6 గంటలకు ముగిసింది. ఈనెల 10వ తేదీ ఉదయం 6 గంటలకు ప్రారంభమైన సప్తాహం 17వ తేదీ ఉదయం 6 గంటల వరకు 7 రోజులపాటు భజన కార్యక్రమం నిర్వహించారు. అనేక గ్రామాల నుండి భజన బృంద సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో అలరించాయి. వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలచార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళాకారులను గ్రామ పెద్దలు, యువకులు ఘనంగా సత్కరించారు .

స్నేహితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చీడికాడ:విద్యార్థి దశలో అందరూ కలిసి చదువుకున్నారు. ఓ స్నేహితుడు అనారోగ్యంతో ఉండటంతో వారంతా మానవతా హృదయంతో ఆర్థిక సాయం అందించారు. 1993వ సంవత్సరంలో చీడికాడ మండలం అప్పలరాజుపురం గ్రామంలో 10వ తరగతి బ్యాచ్‌లో కలిసి చదువుకున్న స్నేహితులలో ఒకరైన పిచ్చికా సత్యనారాయణ అనారోగ్యం కారణంగా మంచానికి పరిమితం అయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు రూ.31000 వేల నగదు, రెండు బస్తాల బియ్యం, వంట నూనెను అందజేశారు. ఈ కార్యక్రమంలో మట్టా అప్పలకొండ, బత్తిన సత్యనారాయణ, మంకు దేముడు, కూరచ వెంకట రమణ, అనపగడ్డి అప్పారావు, నానాజీ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో కైలాసపట్నం వరాహ నది పరివాహక ప్రాంతం నుండి రాత్రి పగలనే తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా రెవెన్యూ అధికారులు అటువైపు చూడలేదు.ఇసుకను అక్రమంగా తరలించడంతో నదీ పరివాహక ప్రాంత రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండల రెవెన్యూ అధికారులకు స్థానిక అధికార పార్టీ నాయకులు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. దీంతో విచ్చలవిడిగా అక్రమ రవాణా చేస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంట్టే అవకాశం ఉంది. ఇక్కడ నుంచి మండలంలో పలు ప్రాంతాలకు రవాణా చేయడమే కాకుండా డంపింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలోని బుచ్చిరాజుపేట పంచాయతీ సర్పంచ్, వైసీపీ నాయకులు కాళ్ల శ్రీనివాసరావుతో పాటు పలువురు టిడిపిలో చేరారు. ఈ మేరకు మంగళవారం రాత్రి పాయకరావుపేట నియోజకవర్గం అసెంబ్లీ కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం ఉంటుందని అనిత అన్నారు. అనంతరం గ్రామంలో ప్రచారం చేపట్టి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు .

19న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కేడిపేటలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు నేపథ్యంలో ఈ నెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నర్సీపట్నం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విడివి.రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేడిపేట, నాగాపురం, శరభన్నపాలెం ఫీడర్స్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

హాల్ టికెట్లు నిలుపుదల చేయొద్దు

ప్రజాశక్తి-మధురవాడ : పాలిటెక్నిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఫీజు బకాయిల పేరిట విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేయడం తగదని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం కళాశాలల యాజమాన్యాలను కోరారు. కొమ్మాదిలో ఒక ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాల హాల్‌టికెట్ కోసం విద్యార్థినిని ఇబ్బందికి గురిచేయడం, ఆమె తల్లి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వార్త మీడియాలో వచ్చిన నేపథ్యంలో వారు స్పందించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఫీజు బకాయిల విషయంలో కళాశాలలు మానవతా దృక్పథంతో ఆలోచించి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. ఇటువంటి ఇబ్బందులు ఎదురైతే మంగళగిరిలోని కమిషన్ కార్యాలయానికి ఫోన్ ద్వారా లేదా ఈ మెయిల్ apscpcr2018@gmail ద్వారా సమాచారం అందిస్తే చర్యలకు ఉపక్రమిస్తామని పేర్కొన్నారు.

వైసిపి రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తా

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:కార్యకర్తల అభిప్రాయం మేరకు అరకు అసెంబ్లీ వైసీపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు వంతాల రామన్న ప్రకటించారు. బుధవారం అరకులోయ శ్రీ సాయి సువర్ణ ప్రవేట్ రిసార్ట్స్ లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడి పని చేశానని, అయినా గుర్తించలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.సర్పంచ్ గా ప్రజల సమస్యలు తెలుసుకోవడం జరిగిందని అన్నారు. జగన్మోహన్ రెడ్డిని రెండవసారి ముఖ్యమంత్రి చేయాలనే సంకల్పంతో పార్టీ కోసం ఎన్నో కష్టాలు పడి బలోపేతానికి కృషి చేశానని తెలిపారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే చట్టసభలో నిరుద్యోగ, రైతుల సమస్యలపై చట్టసభల్లో ప్రజా గళాన్ని విప్పుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదబయలు మండలం కిముడుపల్లి ఎంపిటిసి పాంగి రామారావు, పి.మహాత్మజి వార్డు సభ్యులు వంతాల బాబురావు, వైసిపి సీనియర్ నాయకులు వంతల దేముడు, కొండలరావు, శివన్న, తమ్మన్న, కొర్ర విశ్వనాథం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామన్న

'బిజెపి అధికారంలోకి వస్తే చట్టాలకు తూట్లు'



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి సభ్యులు జానకమ్మ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:రాజకీయ భిక్ష పెట్టిన జగన్ పై మబిజెపి ఎంపీ అభ్యర్థి గీత విమర్శలు చేయడం సరికాదని, బిజెపిని ప్రజలు నమ్మే స్థితిలో లేరని జడ్పిటీసీ సభ్యురాలు జానకమ్మ తెలిపారు. మండలంలోని అరుకు సంతబయలులో ఎంపీపీ బి ఈశ్వరి ప్రజాప్రజా ప్రతినిధులుతో బుదవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ, కాషాయ పార్టీలో చేరిన గీత జగన్ పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. బిజెపి అధికారంలో వస్తే ఆదివాసి చట్టాలు, హక్కులు పూర్తిగా నిర్వీర్యం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి లు ఆనంద్, లలిత, నాగేశ్వరరావు, ఎం శ్రీరాములు, పాల్గొన్నారు.

నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్

ప్రజాశక్తి-కోటవురట్ల

మండల కేంద్రానికి సమీపంలోని లింగాపురం కూడలి వద్ద పంచాయతీ నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు గతేడాది ప్రారంభించారు. నేటికీ దానిని వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో వృధాగా పడి ఉంది. మండల కేంద్రానికి సమీపంలో ఉండటంతో షాపింగ్ కాంప్లెక్స్‌కు డిమాండ్ ఉన్నా వినియోగంలోకి తీసుకు రాకపోవడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు షాపులు వినియోగంలోకి తీసుకు వచ్చినట్లయితే ఒక్కో షాపుకు కనీసం రూ.1500 వరకు అద్దె వచ్చేది. గతేడాది 11వ నెలలో ప్రారంభించిన షాపింగ్ కాంప్లెక్స్ సుమారు 14 దుకాణాల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే వినియోగంలోకి తీసుకొచ్చినట్లయితే ప్రతినెలా సుమారు రూ.20వేల ఆదాయం వచ్చేది. వినియోగంలో లేక షాపింగ్ కాంప్లెక్స్ దెబ్బతినే అవకాశం ఉంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి వృధాగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

తోట త్రిమూర్తులను అనర్హుడిగా ప్రకటించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎస్‌సి, ఎస్‌టి కోర్టులో శిక్ష పడిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులను ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర కౌన్సిల్ కన్వీనర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. రేసపువానిపాలెంలోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తోట త్రిమూర్తులపై ఐదు సెక్షన్ల కింద నేరం రుజువు అయిందని తెలిపారు. తీవ్ర నేరం జరిగితే 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని గుర్తు చేశారు. అయితే కోర్టు ఇచ్చిన తీర్పు నిరాశ, నిస్పృహ రీతిలో ఉందని అభిప్రాయపడ్డారు. నిందితుడికి నేరం నుంచి ఊరట కలిగించే విధంగా తీర్పు ఉందని, తీర్పును పున్ణ సమీక్షించాలని కోరారు. త్రిమూర్తులకు టికెట్ ఇచ్చిన జగన్ పట్ల కూడా దళితులు అనుకూలంగా లేరని, వెంటనే ఆయన దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ శిరోముండనం వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చిన విలేకరి రాజుకు ఆయన కతజ్ఞతలు తెలిపారు.

విదసం కో -కన్వీనర్ సుధాకర్ మాట్లాడుతూ, సుదీర్ఘ పోరాటంతో వచ్చిన తీర్పు సంతప్తి కరంగా లేదన్నారు. దళిత నాయకుడు కె.చిన్నారావు మాట్లాడుతూ, సామాజిక న్యాయం అంటున్న జగన్ ఆత్మ గౌరవానికి భంగం కల్గించిన త్రిమూర్తులను ఎన్నికల బరి నుంచి తప్పించాలని కోరారు. సమావేశంలో విదసం నేతలు సుధాకర్, ఓంకార్, త్రినాధ్, రాజేంద్ర ప్రసాద్, ఈశ్వరరావు, ప్రసాద్, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి -అనంతగిరి:ఇటుకల పండుగ నేపథ్యంలో కుటుంబ సభ్యులంతా సరదాగా గడుపుతుండగా రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గిరిజనులు మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. మండలంలోని మారుమూల పెద్దకోట పంచాయతీ చట్టకంబ గ్రామానికి చెందిన సోకెలి నాగరాజు (28), మామిడి రవి (20) రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. బుధవారం గ్రామం నుండి దేవరపల్లి మండలానికి బైక్‌పై ముగ్గురు వెళుతున్నారు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొని లోయలోకి దూసుకు పోయింది. ఈ ఘటరలో ఇద్దరు మృతి చెందగా మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ కుర్రాళ్ళు రామలక్ష్మి పరామర్శించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఆమె అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-చీడికాద,బుచ్చయ్యపేట:చీడికాడ మండలం పెద్దగోగాడ గ్రామ శివారులో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి మృతి చెందాడు. బుచ్చయ్యపేట మండలం పైడిభీమవరం గ్రామానికి చెందిన పడాల వరహాలు (32) తన అత్తవారి గ్రామమైన దేవరాపల్లి మండల వాకపల్లి గ్రామానికి బైక్‌పై వెళుతున్నాడు. మార్గ మధ్యలో పెద్ద గోగాడ గ్రామం శివారులో బైక్ గెడ్డలో ప్రమాదవశాత్తు పడి మరణించి ఉండవచ్చని చీడికాడ ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ ఘటనను స్థానికులు చూసి సుమారు నాలుగు గంటలకి సమాచారం అందించగా సిబ్బందితో వెళ్లి కేసు నమోదు చేశామన్నారు. వరహాలు మృతితో బుచ్చయ్యపేట మండలం పి.భీమవరంలో విషాదం అలుముకుంది. మృతుడు 15 ఏళ్ల క్రితం ఇండియన్ ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నాడు.రెండు రోజుల క్రితం కుమారుని పుట్టి వెంట్రుకలు తీయించడానికి వచ్చి మృతి చెందటంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏటిగైరంపేట పంచాయతీ సీతకండి గ్రామ శివారులో నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేసినట్లు గొలుగొండ ఎస్సై బీ.కృష్ణారావు బుధవారం తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి ఉపయోగించే 1300 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామన్నారు. నాటుసారా విక్రయించినా, తయారు చేసినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం కితంపేట గ్రామ శివారు సమీప తోటలో బుధవారం మధ్యాహ్నం జూదం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి సుమారు రూ.8.150ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు కొత్తకోట ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. కొన్ని రోజులుగా కిత్తంపేట గ్రామ సమీపంలో జూదం ఆడుతున్నట్లు పక్కా సమాచారం ఉందన్నారు. బుధవారం మధ్యాహ్నం సిబ్బందితో దాడి చేయగా ముగ్గురు వ్యక్తులు జూదం ఆడుతూ పట్టు పడ్డారని, వారి నుంచి నగదుతో పాటు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ పేర్కొన్నారు కేసు నమోదు చేసి చోడవరం కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో యువత అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. సిఐ వై.రామకృష్ణ కథనం ప్రకారం... జివిఎంసి 8వ వార్డు పరిధిలోని తారకరామ్‌నగర్‌కు చెందిన జోష్నారెడ్డి హైదరాబాదులోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. వర్క్‌ఫ్రమ్ హోమ్‌లో ఉన్నారు. మంగళవారం ఉదయం బయటికి వెళ్లిన జోష్నారెడ్డి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లేదు. ఈ క్రమంలో ఇంట్లో ఒక లేఖ దొరికింది. అందులో తన గురించి వెతకొద్దు అని రాసి ఉంది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

'తోట'కు జైలుశిక్షపై హర్షం

- అంబేద్కర్‌కు దళిత హక్కుల పోరాట సమితి నివాళి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : దళితులకు శిరోముండనం కేసులో 28ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత తోట త్రిమూర్తులకు ఏడాదిన్నర జైలు, రూ.3.50 లక్షల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునివ్వడంపై దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పును స్వాగతిస్తూ బుధవారం ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, కోర్టు తీర్పులు ఆలస్యంగా రావడం వల్ల నిందితులకు మనోధైర్యం పెరిగి, మరిన్ని అకృత్యాలకు ఆస్కారమేర్పడుతందన్నారు. ఇటీవల చోటుచేసుకున్న నూతన్ నాయుడు, డాక్టర్ సుధాకర్ ఘటనలు ఇందుకు నిదర్శనమన్నారు. చుండూరు, కారంచేడు ఘటనల్లో 32గడచినా నేటికీ బాధితులకు న్యాయం జరగలేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, అత్యాచార కేసుల్లో తీర్పులు త్వరగా రావాలని ఆకాంక్షించారు. దళితుల శిరోముండనం కేసు వాదించిన న్యాయవాది బొజ్జా తారకంకు నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి సభ్యులు పాల్గొన్నారు.

విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యేగా పోటీ

నేడు నామినేషన్ దాఖలు

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కెఎ.పాల్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :వచ్చే ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ తరపున విశాఖ ఎంపీగా, గాజువాక ఎమ్మెల్యేగా తాను పోటీ చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కెఎ పాల్ అన్నారు. ఈ నెల 18న నామినేషన్ దాఖలు చేయనున్న తనను, ఓటర్లు ఆదరించి గెలిపించాలని కోరారు. బుధవారం రైల్వే న్యూకాలనీలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 'పాల్ రావాలి, పాలన మారాలి' నినాదంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీకి హెలికాప్టర్ గుర్తుకు బదులుగా కుండ గుర్తును ఎన్నికల సంఘం కేటాయించిందన్నారు. ఈ సందర్భంగా ముంబాయికి చెందిన తన మిత్రుడు పంపిన పాల్ రావాలి, పాలన మారాలి ప్రచారగీతాన్ని విడుదల చేశారు. మీడియా సమావేశంలో పార్టీ నాయకులు యేసుపాదం, జీలకర్ర రవికుమార్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఎల్ఇడి వెలుగులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : 'ప్రతి రోజు సూర్యుడు' కార్యక్రమంలో భాగంగా మన్యం పార్వతీపురం జిల్లాలో 61 గిరిజన, మధ్య తరగతి పల్లెలలో 700 అత్యంత నాణ్యమైన ఎల్ఇడి దీపాలను అమర్చామని సిగ్నిఫై మార్కెటింగ్ హెడ్ నిఖిల్ గుప్తా తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ, 'గ్రాస్ రూట్' స్వచ్ఛందసంస్థ భాగస్వామ్యంతో జనకల్యాణ సమాఖ్య సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ ప్రాజెక్టు చేపట్టామన్నారు. మన్యంలో మహిళలు, స్థానిక సంఘాల భద్రత, రక్షణను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు కింద గిరిజన గ్రామాల్లో వెలుగులు నింపామన్నారు. వీధులలో వెలుగు ఉంటే క్రూరమగాల ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు పిల్లలు బయట ఎక్కువగా ఆడుకోవడానికి, మహిళల భద్రతకు భరోసాగా ఉంటుందన్నారు.

వాటర్ పోలో విజేత ఇండియన్ నేవీ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : నగరంలోని డాల్ఫిన్‌హిల్ స్విమ్మింగ్ పూల్‌లో తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 73వ ఇంటర్ సర్వీసెస్ వాటర్ పోలో ఛాంపియన్‌షిప్ విజేతగా ఇండియన్ నేవీ జట్టు నిలిచింది. సేవా సిబ్బంది మధ్య స్నేహభావాన్ని, క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంతోపాటు రాబోయే 77వ సీనియర్ నేషనల్స్ ఆక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు సర్వీసెస్ టీమ్ ఎంపికకు ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలను నిర్వహించారు. . 30 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్న ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత నౌకాదళం, భారత వైమానిక దళం జట్లు, పూల్‌లో తలపడ్డాయి. అసాధారణ నైపుణ్యం ప్రదర్శించిన నేవీ జట్టు విజేతగా నిలిచి ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ముఖ్య అతిథిగా సబ్‌మెరైన్స్ ఫ్లాగ్ ఆఫీసర్ వైస్ అడ్మిరల్ కె.వెంకట్రామన్ పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేసారు. ఈ సందర్భంగా ఆక్వాటిక్ క్రీడాకారులను సత్కరించారు.

ఘనంగా శ్రీరామ నవమి ఉత్సవాలు



రామదుర్గంలో రాములోరి దర్శనానికి వచ్చిన భక్తులు

ప్రజాశక్తి-దేవీపట్నం : మండలంలోని పూడిపల్లి పంచాయతీ నేలకోట గ్రామ కొండల్లో వేంచేసిన రామదుర్గం పుణ్య క్షేత్రంలో శ్రీరామ నవమి ఉత్సవాలు, రాముల వారి కల్యాణ వేడుకలు కన్నుల పండుగగా బుధవారం ఘనంగా జరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఈ ఉత్సవాలకు రావడంతో రామదుర్గం ఆలయం భక్తులతో కళకళలాడింది. దాదాపు 5 కిలోమీటర్లు కాలినడకన కొండ ఎక్కి సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు ఆలయ నిర్వాహకులు చేశారు. భక్తులకు అన్న ప్రసాదాలు, తాగునీటిని సరఫరా చేశారు.దేవీపట్నంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో రాములోరికి ఘనంగా పూజలు నిర్వహించారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు రామాలయంలో సీతారాముల కళ్యాణం బుధవారం వైభవంగా జరిగింది. దాతలు అందజేసిన బెల్లం పానకం మజ్జిగ భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అనంతరం స్వామివారి సన్నిధిలో సీలేరు మహిళా భక్తులు కోలాటం ప్రదర్శించారు. మండలంలోని దారకొండ, దుప్పిలివాడ పంచాయతీ వలసగెడ్డ గ్రామాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవం రంగ రంగ వైభవంగా జరిగింది. మారుమూల గిరిజన గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఇక్కడ ఏపీ జెన్కో ఏఈ సుబ్రహ్మణ్యం దంపతులు ఆర్థిక సహాయంతో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.



ఉత్సంలో కోలాటం ఆడుతున్న స్థానిక మహిళ కళాకారులు

పోటీ పరీక్షల సన్నద్ధతపై అవగాహన

- అన్ అకాడమీ 'ఉడాన్'కు మంచి స్పందన



బహుమతులిస్తున్న అన్ అకాడమీ 'ఉడాన్' ప్రతినిధులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఐఐటి, జెఇఇ, నీట్ వంటి పోటీ పరీక్షల సన్నద్ధతపై ప్రముఖ లెర్నింగ్ ఉడాన్ ఈవెంట్ ద్వారా యాప్ 'అన్ అకాడమీ' సంస్థ తమ అధ్యాపకులతో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించింది. బుధవారం సిరిపురంలోని సంస్థ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అన్ అకాడమి రిజనల్ కొఆర్డినేటర్ జగ్నూర్ సింగ్ మాట్లాడుతూ ఉడాన్ ఈవెంట్ ద్వారా నిపుణులైన అధ్యాపకులతో విద్యార్థులు నేరుగా ఇంటరాక్ట్ అయి, ఐఐటి, జెఇఇ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో విజయానికి అవసరమైన మార్గనిర్దేశం పొందడానికి సమగ్ర వేదిక అన్నారు. పోటీ పరీక్షలకు కావాల్సిన సలహాలు, సూచనలు, నిపుణుల చిట్కాలు, వ్యూహాలను ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా పొందవచ్చన్నారు. ఈసందర్భంగా అన్ అకాడమీ టాప్ ఎడ్యుకేటర్స్ విశిష్ట ప్యానెల్ పాల్గొని విద్యార్థులకు సిలబస్, పరీక్షల సరళి, అన్ అకాడమీ సమగ్ర అభ్యసన విధానాలను వివరించారు.

ఈ సందర్భంగా ఎపిఐపిఇ 2024 పరీక్షల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన అన్ అకాడమీ విద్యార్థులు మధుసూదన్‌రెడ్డి, కెవిఎస్ విశ్వలను సత్కరించారు. అలాగే పరీక్షలో 97 శాతం కంటే ఎక్కువ, 99.15 పర్సంటైల్‌ను సాధించిన ఎనిమిది మంది విద్యార్థులను అభినందించారు. 650కి మందికి పైగా నీట్, ఐఐటి, జెఇఇ సన్నద్ధత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

అబ్బురపరిచిన అగ్నిమాపక శాఖ మాక్‌డ్రిల్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా బుధవారం సెవెన్‌హిల్స్ హాస్పిటల్‌లో జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి పి.సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్‌డ్రిల్ అబ్బురపరిచింది. షార్ట్‌సర్క్యూట్, ఇతర అగ్నిప్రమాదాల సమయంలో పొగ ఎక్కువగా ఉన్నపుడు స్వీయ ప్రాణరక్షణతోపాటు బాధితుల ప్రాణాలను ఎలా కాపాడాలో వివరిస్తూ ప్రయోగాత్మకంగా అగ్నిమాపక సిబ్బంది చేసిన డ్రిల్ ఆకట్టుకుంది. ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలు, లిఫ్ట్‌లో ప్రమాదాలపై సిబ్బందికి అవగాహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



మాక్‌డ్రిల్ చేసి చూపిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవి నేపథ్యంలో ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేసేందుకు దువ్వాడ మీదుగా ఎర్నాకులం - పాట్నా అన్ రిజర్వుడ్, ఎస్ఎంవి బెంగళూరు - హౌరా మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో 06085 ఎర్నాకులం - పాట్నా అన్‌రిజర్వ్‌డ్ సమ్మర్ స్పెషల్ రైలు ఏప్రిల్ 19 నుంచి జూన్ 28 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 23.00 గంటలకు ఎర్నాకులం నుండి బయలుదేరుంది. ఇది మరుసటి రోజు రాత్రి 23.05 గంటలకు దువ్వాడ చేరుకుని 23.07 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 3.00 గంటలకు పాట్నా చేరుకుంటుంది. 06086 పాట్నా - ఎర్నాకులం అన్‌రిజర్వ్‌డ్ సమ్మర్ స్పెషల్ రైలు ఏప్రిల్ 22 నుంచి జూలై 01 వరకూ ప్రతి సోమవారం 23.45 గంటలకు పాట్నాలో బయలుదేరి బుధవారం తెల్లవారుజామున 01.05 గంటలకు దువ్వాడ చేరుకుని 01.07 గంటలకు బయలుదేరి గురువారం ఉదయం 10.30 గంటలకు ఎర్నాకులం చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్డు, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం, బ్రహ్మపూర్, బాలుగావ్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్ కియోంజర్ రోడ్, భద్రక్ మీదుగా ప్రయాణిస్తాయి .



06585 ఎస్ఎంవి బెంగళూరు - హౌరా సమ్మర్ స్పెషల్ ఏప్రిల్ 19 నుండి జూన్ 24 వరకు ప్రతి శుక్రవారం అర్ధరాత్రి 00.30 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు నుండి బయలుదేరి అదేరోజు రాత్రి 19.25 గంటలకు దువ్వాడకు చేరుకుంటుంది. మరలా 19.27 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10:00 గంటలకు హౌరాకు చేరుకుంటుంది. 06586 హౌరా - ఎస్ఎంవి బెంగళూరు సమ్మర్ స్పెషల్ ఏప్రిల్ 20 నుండి జూన్ 25 వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 13.05 గంటలకు హౌరాలో బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 03.03 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. మరలా 03.05 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 20.10 గంటలకు ఎస్ఎంవి బెంగళూరుకు చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్ మీదుగా ప్రయాణిస్తాయి.

కాంగ్రెస్‌కు ఆదరణ

విశాఖ ఎంపీ, దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థులు సత్యారెడ్డి, సంతోష్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: కాంగ్రెస్‌కు ప్రజాదరణ పెరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో విజయంతో పూర్వవైభవం ఖాయమని ఆ పార్టీ విశాఖ ఎంపి అభ్యర్థి పి.సత్యారెడ్డి, దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి సంతోష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు అధ్యక్షతన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ సాధ్యమని గుర్తించిన ప్రజలు ఆ పార్టీని కోరుకుంటున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలను అందించారని, ప్రస్తుతం వైఎస్ఆర్ తనయ షర్మిలారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌తోపాటు రాష్ట్రం పురోగమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. షర్మిలారెడ్డిపై అవాకులు, చెవాకులు పేలితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వాసుపల్లి సంతోష్ మాట్లాడుతూ,.దక్షిణ ప్రజలు స్థానికేతరులకు తగిన బుద్ధి చెప్పి, స్థానికుడినైన తనను గెలిపించాలని అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని జోస్యం చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కస్తూరి వెంకటరావు, మాడుగుల సత్యనారాయణ, జెటి రామారావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : పేదోడి తలరాత బాగుండాలన్నా, అర్హులకు సంక్షేమ పథకాలు అందాలన్నా జగన్మోహన్‌రెడ్డి పాలనతోనే సాధ్యమని వైసిపి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి, విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ అన్నారు. బుధవారం 91వరోజు పెదజాలరిపేట నుంచి వార్డు వైసిపి ఇన్‌ఛార్జి సూరాడ వెంకటలక్ష్మి దాస్‌తో కలిసి పాదయాత్ర కొనసాగించారు.